సూర్య
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
ఆదివారం,19 నవంబర్ 2023
1

# ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది నియామకానికి చర్యలు

## ప్రభుత్వ విప్ ముదునూరి



**నరసాపురం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం ఆస్పత్రిలో కంటి పరీక్ష చేయుటకు స్లిట్ ల్యాంప్,ఆపరేటివ్ మైక్రోస్కోప్ (ప్రాథమిక శస్త్ర చికిత్సలు చేయుటకు),లెడ్ మానిటర్) కొత్త మిషనరిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య అవసరాల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లకుండా అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.ఆయన కంటి,బి పి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆసుపత్రి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆసుపత్రి సూపరింటెంట్ జాన్ హరీషన్ ముదునూరికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# రబీలో సాగునీటి కొరత లేకుండా చూడాలి

## జడ్పీ సమావేశంలో అధికారులకు చైర్ పర్సన్ పద్మశ్రీ ఆదేశం....

## ఎంపీ కోటగిరి, జిల్లా కలెక్టర్,ప.గో.జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యేలు హాజరు



**ఏలూరు,మేజర్‌న్యూస్:** రబీసీజన్లో సాగునీటికి ఎటువంటి కొరతా లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లాప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశిం చారు. స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సమావేశపు హాలులో శనివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్యసమావేశం చైర్ పర్సన్‌ఘంటాపద్మశ్రీ అధ్యక్షతన జరిగింది.విద్యా,వైద్యం, వ్యవసాయం ఇరిగేషన్, గృహ నిర్మాణం, ఆర్‌అండ్‌బి, తదితర శాఖలలో పనుల ప్రగతిని సమీక్షించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూరబీలో ప్రతీఎకరాకు సాగునీరు అందించేం దుకు అధికారులు పటిష్టమైన ప్రణాళికలు రూపొందించు కోవాలని, ఎక్కడా సాగునీటి కొరత రాకుండా చూడాల న్నారు.శివారు భూములకు సైతం పూర్తిస్థాయిలో సాగు నీరు అందించేందుకు చర్యలుతీసుకోవాలని, ఎగువ ప్రాంతాలలో సాగునీటిని మోటార్లతో అనధికారికంగా వినియోగించకుండా చూడాలన్నారు. కాల్వలు, డ్రైన్లతో పూడికతీసి, తూడు, గుర్రపుడెక్క తొలగించాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతిని మరింత వేగవంతం చేయాలన్నారు. నాడు-నేడు కార్యక్రమం కిందప్రభుత్వపాఠశాలల్లో చేపడుతున్న పనులు, అదేవిధంగా అంగన్వాడీ భవనాల నిర్మాణాలను కూడా త్వరిత గతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాకు ఆర్‌అండ్‌బి శాఖ ద్వారామంజూరు చేసిన రహదారి నిర్మాణ,మరమత్తు పనులు వెంటనే ప్రారంభించాలన్నారు.ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేలా వైద్యాధికారులు పర్యవేక్షించా లన్నారు.బొర్రంపాలెంలో పేదలఇళ్లనిర్మాణం కోసం కేటాయించిన స్థలం అనుకూలంగా లేదని అందుకు ప్రత్యామ్నాయ స్థలాలు మంజూరు చేయాలనీ,జగనన్న కాలనీలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని టి.నర్సాపురం జెడ్పిటిసి కోరగాచర్యలు తీసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ ను కోరారు.ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిజిల్లా పరిషత్ ద్వారానే జరుగుతుందన్నారు. జిల్లా పరిషత్‌కు రెట్టింపు నిధులు మంజూరు చేస్తే గ్రామాలు మరింతఅభివృద్ధి చెందుతా యని, ఈవిషయాన్నీ ముఖ్యమంత్రిదృష్టికి తీసుకువెళ్తా మన్నారు.ఆంధ్రాకాలువ డీసిల్టింగ్ చేయడం ద్వారా చింతలపూడి మెట్ట ప్రాంతంలో మరిన్నిఎకరాలకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఆంధ్రా కాలువ డీసిల్టింగ్‌ను ఉపాధి హామీ పథకంలో చేపడతామన్నారు.జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీన ఏలూరులో జిల్లా ఇంచార్జి మంత్రివర్యుల అధ్యక్షతన జిల్లా సాగునీటి సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి ఉమ్మడి సమావేశం నిర్వహించి రబీలో సాగునీటి నిర్వహణకు అధికారులకు ఆదేశాలు జరీ చేయడం జరిగిందన్నారు.కాల్వలు, డ్రైన్లతో పూడికతీసి, షట్టర్ల మరమ్మత్తులు, తూడు, గుర్రపుడెక్క తొలగించాలని, శివారు భూములకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ పి ఆర్-126 వరి వంగడాలు అధిక దిగుబడి సాధిస్తున్నప్పటికీ, మన ప్రాంతంలో వాటి వినియోగం లేకపోవడం, కేవలం ఇతర ప్రాంతాలకు ఎగుమతి కావడం, నూకల శాతం ఎక్కువగా ఉండడంతో రైతులు అదే పంటను వేసి, ఉత్పత్తి పెరిగి రేటు తగ్గితే మార్కెటింగ్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న దృష్ట్యా రైతులకు ఈ సమస్యలపై వ్యవసాయశాఖాధికారులు అవగాహన కలిగించాలని సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

దెందులూరు శాసనసభ్యులు కొఠారు అబ్బాయి చౌదరి మాట్లాడుతూ పూర్తిగా పాడైన 42 రహదారి నిర్మాణ పనులు రహదారులు, భవనాల శాఖ మంజూరయ్యా యని వాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి అయ్యిందని వాటిని త్వరితగతిన పూర్తిచేయాలనీ అధికారులను ఆదేశించారు. శాసనమండలి సభ్యులుషేక్‌సాబ్జి, ఉంగుటూరు శాసన సభ్యులు ఉప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు), జిల్లా పరిషత్ సీఈఓ సుబ్బారావు, ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లాలవివిధశాఖలఅధికారులు, జెడ్పిటీసిలు, ఎంపిపిలు, ప్రభృతులు పాల్గొన్నారు.

# కేంద్ర పథకాల కోసం జరిగే సంకల్ప యాత్ర విజయవంతం చేయాలి



**భీమవరం, మేజర్ న్యూస్:** కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధి అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేందుకు సంకల్పించిన విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులు ఆదేశించారు.శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం సమావేశ మందిరం నందు విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర-2023 విది విధానాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే దిశగా విస్తృత ప్రచారానికి విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర పేరిట మొబైల్ వ్యాన్ యాత్రను దేశంలోని అన్ని ప్రాంతాల్లో చేపట్టడం జరిగిందన్నారు. విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర కేంద్ర ప్రభుత్వ పథకాలపై పట్టణ, గ్రామాలలో విస్తృతమైన ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈనెల 26 నుంచి జనవరి 26వ తేదీ వరకు జిల్లాలోని పంచాయతీలలో యాత్ర సాగుతుందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నుంచి వాహనాలు జిల్లాకు వస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో మూడు కమిటీలను నియమించడం జరుగుతుందని, వాటిలో స్వాగత కమిటీ, సాంస్కృతిక కమిటీ, ఉత్సవ కమిటీ ఉంటాయన్నారు. గ్రామాలకు వెళ్ళినప్పుడు మండల కమిటీలు, డివిజన్ పరిధిలో ఆర్డీవోలు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. జిల్లాస్థాయిలో అధికారులతో ప్రత్యేక కమిటీ నియమించామన్నారు. అదే మాదిరిగా మండల స్థాయిలోనూ ఎంపీడీవోలు కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీస్థాయిలోనూకమిటీ నియమించాల న్నారు. వాలంటీర్ల ద్వారా ప్రజలలో విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. ఇదే క్రమంలో కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారులతోనూ అధికారులు మాట్లాడాలని తెలిపారు. ప్రజలను సమీకరించడం, చైతన్య పరిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మొబైల్ వ్యాన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించడంతోపాటు, పథకాల ప్రయోజనాలను వివరించడం, పథకాల పొందిన వారి వద్ద నుండి అభిప్రాయాన్ని సేకరించడం, ఇంకా పథకాలు పొందని వారిని గుర్తించి వారి అర్హత మేరకు ప్రయోజనాన్ని కల్పించడం జరుగుతుందన్నారు.


ఈ ప్రచార యాత్రను పర్యవేక్షించడానికి కేంద్ర ప్రభుత్వం నుండి ప్రియాంక్ చతుర్వేది (2010) బ్యాచ్ ఐఏఎస్ అధికారిని నియమించడం జరిగిందని తెలిపారు. పారిశుధ్య సౌకర్యాలు, అవసరమైన ఆర్థిక సేవలు, ఎల్‌పిజి కనెక్షన్‌లకు ప్రాప్యత, పేదలకు గృహాలు, ఆహార భద్రత, సరైన పోషకాహారం, ఆరోగ్యం,స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్య మొదలైన ప్రాథమికసౌకర్యాలనుఅందించడానికి, రూపొందించడం ఒక లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. లాస్ట్ మైల్ డెలివరీని సులభతరం చేయడానికి పౌరులకు అందుబాటులో ఉన్న ప్రయోజనాలు మరియు వివిధ సౌకర్యాల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజరు టి శివ రామ ప్రసాదు, డియస్ వో యన్ సరోజ, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె మల్లిఖార్జున రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.డి మహేశ్వర రావు, జిల్లా పరిశ్రమలు అధికారి యు ఆది శేషు, జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి డా.ఆర్పీ ఆనంద్ కుమార్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు ప్రసాదు, విద్యుత్ శాఖ ఇ ఇ ఫీర్ అహ్మద్ ఖాన్, జిల్లా సర్వే అధికారి కె జాషువా, డ్వామా పిడి యస్టివి రాజేశ్వర రావు, డియర్డిఏ యంయస్ యస్ వేణు గోపాల్, ఆర్డబ్ల్యూఎస్ అధికారి ఏ వీరాస్వామి, జిల్లా మత్స్య శాఖ అధికారి ప్రసాదు, పురపాలక సంఘం కమిషనరు యం శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

# హోం మంత్రి తానేటి వనితను టార్గెట్ చేయడం సరికాదు



**ఏలూరు, మేజర్‌న్యూస్:** దళిత హోంమంత్రిని టార్గెట్ చేయడం టిడిపి నాయకులకు సరికాదని, కొవ్వూరు నియోజకవర్గంలో బొంత మహేంద్రా ఆత్మ హత్య మరణాన్ని కొంత మంది స్వార్థ రాజకీయాల చేసి ఉపయోగించుకోవడం బాధాకరమని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరి కె వరప్రసాదరావు ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సెక్రటరీ రెవరెండ్ పాస్టర్ జీవన్ కుమార్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితను తెలుగుదేశం, జనసేన ఎల్లో మీడియా టార్గెట్ చేయటం ఏమిటని? ఇలా ఎస్సీ మంత్రులకు టార్గెట్ చేసి తెలుగుదేశం బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసి రాజకీయ పబ్బం కడుపు ఉంటుందని ఆరోపించారు. దొమ్మేరు లో మహేంద్ర మరణంపై ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డి తక్షణమే స్పందించి 20 లక్షల రూపాయలు ఆర్థికం సహా యం ప్రకటించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు జరగకుండా చూడాలని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరిక వరప్రసాదరావు కోరారు. అమాయకులైన దళితులను ఉపయోగించుకొని తెలుగుదేశం బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒక దళిత మహిళ హోం మంత్రిగా ఈ స్థాయిలో ఉండటానికి ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డి కారణం అని పేర్కొన్నారు. కార్యకర్తలు,ప్రజలు అందరి సహకారంతో హోం మంత్రి తానేటి వనిత నీతి నిజాయితీగా పరిపాలిస్తుంటే యెల్లో బ్యాచ్ ఎల్లో మీడియా కుట్రలో కుతంత్రాలతో రాజకీయాలు చేస్తున్నారని, ఎన్ని కుట్రలు పన్నినా 2024 లో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ లందరూ సీఎం కావడానికి కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రెటరీ రత్న ప్రసాద్, బి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రసిద్ధ భీమడోలు అయ్యప్పస్వామి ఆలయంలో ఘనంగా ఇరుముడులు



**భీమడోలు, మేజర్‌న్యూస్:** భీమడోలు ప్రసిద్ధ అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మాలాదారుల ఇరుముడి కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగాయి.శనివారం అయ్యప్ప స్వామి ఆలయపీఠంలో మండల దీక్ష ముగించుకున్న 40మంది అయ్యప్ప మాలాదారులు ఆలయ ఆవరణలో విశేషపూజలు నిర్వహించి అనంతరం ఇరుముడి కట్టుకుని స్వామి దర్శనానికి శబరిమలై ప్రయాణమయ్యారు. ఆల య అర్చకులు బృందావనం మధు పవన్ నేతృత్వంలో గణపతి పూజ, ఇరుముడి పూజా అనంతరం ఇరుముడిధారణ జరిగింది. కార్యక్రమంలో హాజరైన భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసారు. కార్యక్ర మంలో ఆలయ గురుస్వామి అల్లూరి రాఘవేంద్రరావు భక్తులు, పాల్గొన్నారు..

# పండుగ వాతావరణంలో తెలగా కళ్యాణమండపం పున: ప్రారంభం





## ప్రత్యేక పూజలు చేసిన రామ్మోహన్‌నాయుడు దంపతులు

**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** పట్టణంలోని తెలగా కళ్యాణ మండపాన్ని కొవ్వలి ఫౌండేషన్ కోటి 50 లక్షలుతో ఆధునికరించింది. మండపంలో ఏసీలు, అతిథి గదులు, లిఫ్ట్ తదితర సౌకర్యాలను ఆధునిక పద్ధతులలో ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 5:30 గంటలకు ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు దంపతులుగృహ ప్రవేశం చేశారు. అనంతరంప్రత్యేక పూజలు,హోమం నిర్వహించారు. వివిధ కులాలకు చెందిన ప్రముఖులు, నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున ప్రజానీకం పాల్గొన్నారు. గృహప్రవేశం సందర్భంగా స్వాములకు విందు ఏర్పాటు చేశారు. అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలోకార్యక్రమాలను పర్యవేక్షించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి చేగొండి హరి రామ జోగయ్య, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు, జనసేన ఇంచార్జ్ బొమ్మిడి నాయకర్ వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కాపు సంఘం నేతలు డాక్టర్ చిన్నమిల్లి సత్యనారాయణ రావు, పప్పుల రామారావు, కోటిపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు అతిథులకు స్వాగతం పలికారు.రాత్రి రామ్మోహన్ నాయుడు నివాసం దగ్గర పడి పూజ ఏర్పాటు చేశారు. శబరిమలైలో ఉన్నట్లుగా ప్రత్యేక సెట్లు వేశారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తునఅయ్యప్పమాల ధారణ స్వాములుపాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి దృష్టి సారించాలి

## ప్రభుత్వ విప్ ముదునూరి



**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్:** వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ అధ్యక్షతన సాధారణ సమావేశము శనివారం జరిగినది. ఈ సమావేశమునకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డు అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని అన్నారు.రైతులు పండించిన ధాన్యమును మార్కెట్ యార్డు, మార్కెట్లకు, తరలించుటకు వ్యవసాయ మార్కెట్ కమిటీ నరసాపురం, మొగల్తూరు మండలాల్లో రైతులు పండించిన పంట రవాణా సౌకర్యం కొరకు బీటీ రోడ్లు రిపేర్లు చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ:12 కోట్ల 12లక్షల 44 వేలు కు ప్రతిపాదనలు పంపగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసి టెండర్లు చేయడం జరిగిందన్నారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు నందు సమీకృత వ్యవసాయ పరీక్ష కేంద్రము నిర్మాణం కొరకు ప్రభుత్వం నుండి రూ:80 లక్షల రూపాయలు మంజూర అయి ఉన్నాయని పనులు మొదలుపెట్టి వెంటనే పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారి ఈద అనిల్ కుమార్‌ని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కటికల సూర్యారావు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంద్రాజు చల్లారావు సభ్యులు గొడుగు ఈశ్వరి,కొప్పునీడి కొండలమ్మ, నడపన వరలక్ష్మి, కొప్పినీడి ఛత్రపతి శివాజీ, బాల నాగేశ్వరరావు, శీరం గౌరీ, బండారు సుశీల, మోటూరి సుజా, గుండా బత్తుల కనక లింగేశ్వరరావు, పింటూ బండారి, షేక్ బుల్ మస్తాన్ నవరత్నపురం సర్పంచ్ ఈదా జగజ్జీవన్ రావ్ మార్కెట్ యార్డ్ సెక్రటరీ జిఎంకే ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోర్టుల ప్రాంగణంలో ఉచిత మెడికల్ క్యాంపు



నర్సాపురం,మేజర్‌న్యూస్:జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నరసాపురం మండల న్యాయ సేవా సంస్థ వారి సహకారంతో శనివారం కోర్టుల ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బిపి,డయాబెటిస్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేయుటకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపు లో కోర్టు సిబ్బందికి, న్యాయవాదులకు, న్యాయవాద గుమాస్తాలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సంస్థ సభ్యులు చల్లా దానయ్య నాయుడు, ఉచిత న్యాయవాదులు దొంగ నరసింహరాజు, సి హెచ్ వెంకటేశ్వరరావు, బళ్ళా శ్రీహరి తదితర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతి వైద్యంతో అన్ని రోగాలకు చికిత్స అందించవచ్చు..

## కరిబండి రామకృష్ణ



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెం సత్యవతి నగర్ రోడ్ నెంబర్ 9 లో గల ఉమర్ ఆలీషా గురువు గారి ఆశ్రమంలో 6వ (నేచురోపతి డే) ప్రకృతి చికిత్సా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో యోగ మాస్టర్, ఆరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీ కరిబండి రామకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి జీవన విధానాన్ని, చికిత్సా పద్ధతులను సభా సభ్యులకు వివరించారు, "రోగం" అనేది జీవం లేనిది అని దాన్ని జీవం ఉన్న మనిషి జీవితాన్ని సరైన పద్ధతిలో జీవించడం ద్వారా తగ్గించు కోఅచ్చు అనే సత్యాన్ని అలనాటి వైద్య రాజు, వేగిరాజు కృష్ణమరాజు చెప్పిన విషయం గుర్తు చేశారు. లైఫ్ స్టైల్ మార్చుకుని, యోగ సాధన, ఆహారపు అలవాట్లను సరి చేసుకోవడం ద్వారా ఎలాంటి రోగాలనైనా నయం చేయవచ్చు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ కంచర్ల లక్ష్మి నరసింహ,అపర్ణ ప్రసాద్ యోగ సాధకులు పాల్గొన్నారు

# టి.నర్సాపురం మండల సమస్యలపై గళమెత్తిన సూరిబాబు



**టీ.నరసాపురం,మేజర్‌న్యూస్:** పశ్చిమ గోదావరి జిల్లా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం లో టీ.నర్సాపురం మండలానికి సంబంధించి పలు సమస్యలపై జిల్లా కలెక్టర్, జడ్పీ చైర్మన్‌కి, ఎంపీకి స్థానిక జడ్పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు (సూరి బాబు) తెలిపారు.శనివారం ఏలూరులో జరిగిన జడ్పీ సమావేశంలో ఆయన పలు సమస్యలను ప్రస్తావించారు. జగనన్న కాలనీల లేఔట్లలో రహదారులు పూర్తి చెయ్యాలని, ఇల్లు నిర్మించుకోవడానికి మౌలిక వసతులు త్వరితగతిన కల్పించాలని కోరారు. బొర్రంపాలెం గ్రామంలో పీహెచ్సీలో వైద్య సేవలు అందుబాటులో ఉండడం లేదని, పిహెచ్సి ఇక్కడ ఉంటే వైద్య సేవలు వేరే గ్రామాలకు అందుతున్నాయని దానికి సంబంధించి టెక్నికల్ ఇబ్బందులను తొలగించి పూర్తి వైద్య సేవలు బొర్రంపాలెం చుట్టూ పక్కల గ్రామాలకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్,జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ని కోరగా అందుకు స్పందించి డిఎంహెచ్వో తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని తెలియజేశారు

బొర్రంపాలెం గ్రామంలో జిఎన్ఆర్ స్కూల్ రోడ్‌లో ఉన్నటువంటి లేఔట్‌లోగృహాలు కట్టుకోవడానికి అనుకూలంగా లేదని, కింద అంతా బండరాయ ఉందని లబ్ధిదారులు ఫిర్యాదులు చేస్తున్నారని కలెక్టర్‌కి, గృహ నిర్మాణశాఖ పిడికి, జిల్లా పరిషత్ చైర్మన్‌కి సూరిబాబు వివరించారు. దానికి సంబంధించి స్థలం మార్పు గురించి ఎమ్మార్వో తో మాట్లాడి మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పిడిని ఆదేశించారని తెలిపారు.అలాగే సమగ్ర రీసర్వే మండలానికి సంబంధించిన పలు సమస్యలపై సర్వసభ్య సమావేశంలో మాట్లాడి నట్టు సూరిబాబు వెల్లడించారు.

సూర్య
పశ్చిమ గోదావరి
ఆదివారం, 19 నవంబర్ 2023



# క్రీడలతో పెరుగుతున్న పోటీతత్వం



**పెదవేగి, మేజర్ న్యూస్ :** క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచుతాయని ఎస్ఎంసీ హైస్కూల్ కరస్పాండెంట్ సీహెచ్.అవినాష్రజు అన్నారు. పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడాపోటీలను ప్రారంభించిన ఎస్ఎంసీ హైస్కూల్ కరస్పాండెంట్ అవినాష్రరాజు మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో క్రీడలు ఒక భాగం కావాలన్నారు. క్రీడలతోనే విద్యార్థి జీవితం పరిపూర్ణమవుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థి క్రీడల్లోనూ నైపుణ్యాన్ని కనబర్చాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్, పీఈటీలు ధనలక్ష్మి, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు మంచి చేయడమే వైసీపీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు**



**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** ప్రజలకు మంచి చేయడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యంమని వైసీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు అన్నారు.మండల పరిధి చిన్న అగ్రిపల్లి గ్రామపంచాయతీ శివారులో గల సింగన్న గూడెం, గొల్లగూడెం స్మశాన వాటికలో శనివారం చేతి కొట్టుడు పంపులు కొరకు రెండు బోర్లు వేశారు. ఈ సందర్భంగా పలగానిమాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో, బోర్లు వెయ్యడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం, ప్రవేశపెట్టిన అభివృద్ధి కార్యక్రమంలో ముందడుగు వేస్తుందని పల్లగాని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న ఆగిరిపల్లి గ్రామ సర్పంచి పల్లగాని రమాదేవి జమదగ్ని, జువ్వన బోయిన జమలయ్య, మాజీ ఎంపీటీసీ చిన్ని రాంబాబు, కానుళ్ళ రాంబాబు, ఉప సర్పంచి, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో గ్రామ రెవెన్యూ అధికారుల కీలక పాత్ర

**ఏలూరు ఆర్‌డిఓ ఖాజావలి**

**భీమడోలు, మేజర్ న్యూస్ :** రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ నాణ్యత లెక్కింపు ,మిల్లులకు రవాణా విషయమై కస్టోడియన్ అధికారులు గా వ్యవహరించే గ్రామ రెవెన్యూ అధికారుల పాత్ర కీలకమని ఏలూరు ఆర్డీవో షేక్ ఖాజావలీ తెలిపారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం గత నెలరోజుల కాలంగా భీమడోలు మండలం పరిధిలో జరిగిన వివిధ అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాలపై ఏలూరు ఆర్డీవో ప్రత్యేక అధికారి హొదాలో నెలవారీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 12 అంశాలపై చర్చ నిర్వహించగా ప్రధానంగా ధాన్యం కొనుగోళ్ళు, ప్రాధాన్యత భవనాల నిర్మాణాల ప్రగతి, మండల పరిధిలో పదేపదే పునరావతమవుతున్న స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు వ్యవహరించవలసిన తీరు, గృహ నిర్మాణ సంస్థ ద్వారా చేపట్టిన నిర్మాణాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు . ఇదే క్రమంలో కీలకమైన సమావేశానికి హాజరుకాని రోడ్లు భవనాల శాఖ భీమడోలు సహాయ ఇంజనీర్, నీటి పారుదల శాఖ , గుండుగొలను సహాయ ఇంజనీర్ కు నోటీసులు ఇవ్వాలని భీమడోలు మండల అభివృద్ధి అధికారి పద్మావతి దేవిని ఆదేశించారు. ఇదే క్రమంలో మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పూళ్ళ, గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, జగనన్న ఆరోగ్య సురక్ష వివరాలను అందించేందుకు శాఖకు చెందిన మండల స్థాయి బాధ్యులు ఎవరు ముందుకు రాకపోవడం పట్ల అసంపూర్తి వెలిబుచ్చా రు.ఇదే క్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వాహణ తర్వాత గుర్తించిన వైద్య సేవలు అవసరమైన రోగులకు ఏ మేరకు అందుతున్నాయన్న విషయమై పూర్తిస్థాయి సమాచారం లేకుండా కింద స్థాయి అధికారులు రావటం పట్ల అసహనం వెలిబుచ్చారు ఈ విషయమై సంబంధిత ఆరోగ్య కేంద్రాల వైద్యులు హాజరు కాకపోవటాన్ని ప్రశ్నించారు .



భీమడోలు మండలానికి రోడ్ అండర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి స్థల సేకరణ జరగకపోవడం ,కార్యక్రమాన్ని కొనసాగించవలసిన అధికారులు రాకపోవడం సమంజసం కాదన్నారు .సమీక్ష సందర్భంగా ప్రాధాన్యతా భవనాల నిర్మాణ బాధ్యులు డిసెంబర్ 10వ తేదీ నాటికి ఇప్పటికే ప్రారంభించిన భవనాలు నిర్మాణాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు .ఈ విషయమై వారి ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇక రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ విషయమై భీమడోలు వ్యవసాయ అధికారి ఉషారాణి మాట్లాడుతూ భీమడోలు మండల పరిధిలో గల నాలుగు ఆర్.బి.కె. కేంద్రాల పరిధిలో ధాన్యం సేకరణ కార్యక్రమం ప్రారంభం కాలేదని దానిని వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు .ఇదే విధంగా భీమడోలు ఆర్.బి.కె- రెండు కేంద్రంలో తేమ శాతాన్ని లెక్కించే యంత్రం పాడైన కారణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు ధాన్యములో నూక శాతం లెక్కించేందుకు రెండు మినీ మిల్లులు భీమడోలు, పూళ్ళ రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం సేకరణ కోసం 2.5 లక్షల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పౌరసరఫరాల సంస్థ భీమడోలు డిప్యూటీ తహసిల్దార్ ఎ. మాధవరావు మాట్లాడుతూ ,ధాన్యం సేకరణ కోసం మండల పరిధిలోని రోజువారి 50 వేల టన్నుల ధాన్యం మరాడించగల నాలుగు మిల్లులు, రోజుకి 15 వేల టన్నుల ధాన్యాన్ని మరాడించగల రెండు చిన్న మిల్లులు అందుబాటులో ఉన్నాయన్నారు .మండల పరిధిలోని 14 రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని భీమడోలు మండల పరిధిలోని భీమడోలు, గుండుగొలను పూళ్ళ సొసైటీలతో పాటు, అంబరు పేట కేంద్రంగా పనిచేస్తున్న ఫార్మర్స్ ప్రొడక్షన్ సెంటర్ ద్వారా మిల్లులకు తరలిస్తున్నట్టు వివరించారు .ధాన్యం సేకరణ కోసం ఇంతవరకు జిపిఎస్ సౌకర్యం అమర్చిన 20 లారీలు, 99 ట్రాక్టర్లు రవాణా కోసం నమోదయాయన్నారు. .వీటిలో ఇంతవరకు 74 ట్రాక్టర్ల సేవలు మాత్రమే వినియోగంలో ఉన్నాయని గుండుగొలను సొసైటీ కి కేటాయించిన 25 ట్రాక్టర్ల సేవలు సదరు సొసైటీ వినియోగించు కోవడం లేదన్నారు .ఈ విషయమై స్పందించిన ఆర్డిఓ సొసైటీ కార్యదర్శి తో ఫోన్లో మాట్లాడారు .ఇక స్పందన ఫిర్యాదుల విషయానికొస్తే మండల పరిధిలో స్పందన ఫిర్యాదులు పరిష్కారం కాక పునరావృతం కావటం ఎక్కువగా ఉన్నాయన్నారు. పిర్యాదు దారులు విదేశాల్లో ఉన్నప్పటికీ వారి అనుమతితోనే ఫిర్యాదును పరిష్కరించినట్టు నమోదు చేయాలని లేకుంటే పెండింగ్ చూపించాలని తెలిపారు. ఒకవేళ ఫిర్యాదుదారుడు స్పందించకుంటే సంబంధిత శాఖ అధికారులు ఇతర ఉన్నత స్థాయి అధికారులకు ,మండల స్థాయి అధికారులకు తెలియజేసి వారి సహకారంతో ఫిర్యాదుదారులు సంతృప్తి చెందినట్టు వేలిముద్ర తీసుకొని ఫిర్యాదు దర్యాప్తు పూర్తయినట్టు నమోదు చేయాలని తెలిపారు. ఈ విషయమై కొందరు అధికారులు అడిగిన సందేహాలకు తగు పరిష్కార మార్గాలను ఆయన సూచించారు. సమగ్ర భూ రక్షా స్వమిత్వ కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భీమడోలు తహసిల్దార్ ఎం ఇందిరా గాంధీ పాల్గొన్నారు.

# పుస్తక విజ్ఞానంతో ఉన్నత స్థితికి




**భీమడోలు, మేజర్ న్యూస్ :** పుస్తక విజ్ఞానం తోనే ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకుంటారని ప్రముఖ న్యాయవాది పూడి సంపదరావు అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయవారోత్సవాలలో భాగంగా భీమడోలు శాఖా గ్రంథాలయం ఐదవ రోజు శనివారం గ్రంథపాలకుడు కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాలేజీ, ఉన్నత పాఠశాలల విద్యార్థులు వ్యాస రచన, చెస్ పోటీలు నిర్వహించారు.వివిధ పాఠశాలల చిన్నారులు పోటీలలో తమ ప్రతిభను చాటారు చెస్ పోటీలకు సత్యేంద్ర న్యాయ నిర్ణీతగా వ్యవహరించారు.స్వచ్ఛంధ్రప్రదేశ్ లక్ష్యసాధనలో పౌరుల పాత్ర పై వ్యాసరచన పోటీలు జరిగాయి.తొలుతా జరిగిన కార్యక్రమానికి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తుమ్మల వెంకట ఉమామేశ్వరరావు అధ్యక్షత వహించారు. అనంతరం చిన్నారులు, పెద్దలుతో భారీర్యాలీ చేశారు. గ్రంధాలయలే ముద్దు, సెల్ ఫోన్ వద్దు అంటూ ర్యాలీ చేసి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలు యువకులు పాల్గొని విజయవవంతం చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, పెద్దలు యర్రంశెట్టి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యే డిఎన్ఆర్**




**ముదినేపల్లి, మేజర్న్యూస్ :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కోరారు. మండలంలోని వాడవల్లిలో ఆర్బికే కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఖరీఫ్ లో ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. రైతులు వరికోత కోసిన తర్వాత నాణ్యత ప్రమాణాలు పాటించాలని , ఆరబెట్టిన వరిలో తప్ప , తాలు , మట్టిపెళ్ళలు లేకుండా 17 లోపు తేమశాతం ఉండేలా చూసుకోవాలన్నారు. ఆర్బికే కేంద్రాల టెక్నికల్ అసిస్టెంట్లు రైతుల వద్ద ధాన్యం నమూనాలు స్వీకరిస్తారన్నారు. ఎఫ్ టి ఓ పత్రాన్ని రైతు భరోసా కేంద్రాల నుండి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ధాన్యం తోలే వాహనాలకు తప్పనిస రిగా జిపిఎస్ పరికరాలు అమర్చుకోవాలన్నారు. ప్రభుత్వం దాన్యం కొనుగోలును మరింత సరళీకృతం చేసిందన్నారు. గోనేసంచలు , హమాలిచార్జీలు,రవాణాఖర్చులు రైతులుపెట్టుకుంటే వాటిని రైతులు ఖాతాల్లో జామ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ , సర్పంచ్ , ఎంపీటీసీ , ఆర్బికే ఇన్ చార్జీలు , అధికారులు , నాయకులు పాల్గొన్నారు.

# అగ్ని బాధిత కుటుంబానికి అండగా నిలిచిన తపన ఫౌండేషన్



**ముదినేపల్లి,మేజర్న్యూస్:** ముదినేపల్లి మండలం అన్నవరం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమై కట్టుబట్టలతో నిరాశ్రయులైన ఈడే నాంచారమ్మ కుటుంబానికి తపన ఫౌండేషన్ అండగా నిలిచింది. అగ్ని ప్రమాదం విషయం తెలిసి తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి స్పందించారు. శనివారం సాయంత్రం నాంచారమ్మ కుటుంబ సభ్యులను ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ పరామర్శించారు. తపన ఫౌండేషన్ తరఫున పంపించిన బియ్యం బస్తా, కిరాణా సరుకులు, వంట పాత్రలు అనంత శ్రీరామ్ చేతుల మీదుగా నాంచారమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శిలు కోటప్రోలు కృష్ణ, నగరపాటి సత్యనారాయణ, మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, కే నాగరాజు, రెడ్డి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



**ఏలూరు, మేజర్ న్యూస్:** ఏలూరు బాలల గ్రంథాలయం వారోత్సవాల్లో భాగంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళారత్న సుజయ్ కృష్ణ విద్యార్థులు ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక కళలో నైపుణ్యతను పొందాలని, వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాలని అవి మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని తెలిపారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించడం అయినది. ఈ పోటీలో దాదాపు 100 మంది విద్యార్థుల వరకు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నందు లాయర్ జిల్లెల్లమూడి వరప్రసాద్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పాఠకులు, గ్రంథాలయ నిర్వాహకురాలు ఎమ్ శోభ రికార్డు అసిస్టెంట్ ఎం కీర్తి పాల్గొన్నారు.

# శ్రీవారి నిత్యాన్నదానానికి లక్ష విరాళం



**ద్వారకాతిరుమల,మేజర్న్యూస్:** పవిత్ర పుణ్యక్షేత్రమైన చిన్న వెంకన్న ఆలయ నిత్యన్నదానానికి దాతలు విరాళం అందజేశారు. దూబచర్ల గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ సత్యవతి దంపతులు పేరున రూ 1 లక్ష 1వెయ్యి 116 లు విరాళాన్ని శ్రీ ఒకదు మాత నిత్యాన్నదాన ట్రస్ట్ సిబ్బందికి అందజేశారు.వారికి అన్నదాన సూపర్డెంట్ రాజు చేసి బాండ్ పత్రాలను స్వామివారి ప్రసాదాలను అందించి అభినందనలు తెలిపారు.

# వివిధ కార్యక్రమాలను ప్రారంభించిన ఆలయ చైర్మన్ ఎస్వి సుధాకర్ రావు





**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** చిన్న వెంకన్న ఆలయ ప్రాంగణంలో శ్రీవారి నిత్య కళ్యాణ మండపం పక్కన సహస్ర దీపాలంకరణ మండపానికి శంకుస్థాపన మరియు శ్రీవారి గోశాల నందు విజయదశమి రోజున నూతనముగా ప్రారంభించబడిన గో పోషణ పథకం కర్రపత్రాలను ఆలయ చైర్మన్ ఎస్ వి సుధాకర్ రావు మరియు ధర్మకర్తలు నివృతరావు ఆలయ ఈవో వేంద్ర త్రినాధరావు వారి సమక్షంలో విడుదల చేశారు.

# విద్యార్థులకు చిత్రలేఖనం,దేశభక్తి గేయాలు వ్యాచారచన పోటీలు



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** స్థానిక శాఖ గ్రంధాలయం నందు 56వ వార్షికోత్సవాలులో భాగం గా 5వ రోజు విద్యార్థులకు వివిధ అంశాలలో జనరల్ క్విజ్, చిత్రలేఖనం,దేశభక్తి గేయాల పోటీలు వ్యాస రచన నేటి ఆధునిక సమాజములో గ్రంథాలయాల పాత్ర పోటీలను గ్రంధాలయా ధికారిని గుర్రం బంగారు పాప ఆధ్వర్యంలో ఎస్వి ఎస్ డి ఓ స్కూల్ టీచర్ సిహెచ్ కాంతారావు, అంబేద్కర్ గురుకుల పాఠశాల గ్రంధాలయాధికారి పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహించారు. విద్యార్థులలో శారీరక, మానసిక వికాసానికి ఈ క్రీడలు దోహదం పడతాయని వ్యాసరచన ద్వారా విద్యార్థులలో సృజనాత్మక శక్తులు బయటకు తీసేలా ఉపకరిస్తా యని,వారు విద్యార్థులకు తెలియ జేశారు.ఈ కార్యక్రమములో ఎస్విడివో స్కూల్ విద్యార్థులు, మం డలపరిషత్పాఠశాలవిద్యార్థులు,పాఠకులు,బట్టుమణి పాల్గొన్నారు.

# టీట్కో ఇళ్ల వద్ద అనేక సమస్యలతో గొల్లుమంటున్న నివాసకులు

**పాలకొల్లు, మేజర్ న్యూస్:** పాలకొల్లు పట్టణంలో మున్సిపల్ కమిషనర్ బదిలీ అయ్యి చాలా రోజులు గడుస్తుంది. ముఖ్యంగా పట్టణంలో గల అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు, మున్సిపల్ ఎన్నికలు జరిగి ఏళ్లు గడుస్తున్నా టీట్కో ఇళ్ల వద్ద అనేక సమస్యలతో నివాసకులు గొల్లుమంటున్నారు,ఇన్చార్జి కమిషనర్ ఏలూరు నుండి నెలకు ఒకసారి వస్తే ఈ సమస్యలు ఎవరితో చెప్పుకోవాలో అర్థం కాక పట్టణ ప్రజలు అయోమయానికి గురవుత న్నారు, ప్రజా ప్రతినిధులు వైసిపి ఉన్నత నాయకులు పట్టించు కోవడంలేదని పలువురు వాపోతున్నారు, క్రింది స్థాయి ఉద్యోగులు అర్జిదారులను పదేపదే కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ కాలయాపన చేయడంతో పలువురు ఆవేదన చెందుతున్నారు, తమ తమ వార్డులలో మౌలిక సదుపాయాల కోసం ఎంత చెప్పినా అధికారులు పెడచెవిన పెడుతున్నారని ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నా రు, ఎప్పటికైనా కమిషన్ను నియమించాలని పలువురు కోరుతు న్నారు. కొందరు అధికారులు ప్రతి పనికి మామూళ్ల మత్తులో ము నిగి కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారనిఆవేదనవ్యక్తం చేస్తున్నారు

# తల ఎత్తుకునేలా చేసేది పుస్తకమే

**గ్రంథాలయ వారోత్సవాల్లో**
**ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు సత్యనారాయణ**





**జంగారెడ్డిగూడెం,మేజర్న్యూస్ :** తలదించుకుని నన్ను చూస్తే తల ఎత్తుకునేలా చేస్తానని పుస్తకం చెప్పుతోదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు రిటైర్డ్ లైబ్రేరియన్ గద్దె సత్యనారాయణ లు తెలిపారు. 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ బి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ మనిషిని మరో ప్రపంచంలోకి తీసుకువెళ్లేదే పుస్తకం అని అన్నారు. పుస్తకం విలువ ఎంతో గొప్పదని తెలియజేశారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం అన్ని రకాల పుస్తకాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు తెలిపారు. పుస్తకాలు కొనుక్కో లేని పేద విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అన్ని రకాల ఉద్యోగాలకు ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఒక మోడల్ లైబ్రరీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రిటైర్డ్ లైబ్రరియన్ గద్దె సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపాయని ఆయన పేర్కొన్నారు. తాను పనిచేసిన కాలంలో గ్రంథాలయాల్లో చదువుకున్న విద్యార్థులు డీఎస్పీలుగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడి ఈరోజు ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలియజేశారు. దేశంలోని నెంబర్ వన్ 10 రకాల పుస్తకాల్లో ఏ లైబ్రరీలో దొరకని పుస్తకం మన కళాశాల లైబ్రరీలో దొరకడం చాలా విచిత్రంగాను ఆనందంగాను ఉందని హిస్టరీ అధ్యాపకులు బండి అశోక్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ బి శ్రీనివాస్ గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్లను ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు, గద్దె సత్యనారాయణ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బద్రి నారాయణ వెంకటాచార్యులు వెంకట లాల్ శ్రీనివాసరావు ఉత్తమ సాగర్ సిహెచ్ రమాదేవి లైబ్రరియన్ మధు బాబు రికార్డ్ అసిస్టెంట్ సుధారాణి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యువత భవితకు బంగారు బాటలు వేయలన్నదే 'తపన'



**కైకలూరు, మేజర్ న్యూస్:** మండవల్లి గ్రామంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ప్రతినిధి బండి దివాకర్ స్వగృహమునందు కొర్లపాడు గ్రామ యువతకు ప్రముఖ సినీ గేయ రచయిత చేగొండి అనంత శ్రీరామ్ చేతుల మీదుగా వాలీబాల్ కిట్లు ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి శ్రీరామ్ మాట్లాడుతూ, క్రికెట్లో అగ్రగామిగా ఎదగాలంటే ముంబై వాసులు మాత్రమే అవకాశాలు ంటాయి అని అందరూ అనుకుంటారు. కానీ క్రికెట్లో ప్రముఖ ఆటగాళ్లయిన సచిన్ టెండూల్కర్ ఎంఎస్ ధోనీలు మీలాగే గ్రామస్థాయి నుండి ఎదిగినటువంటి వాళ్ళు మీమనసులో ఏవిధమైన అనుమానాలు లేకుండా మీరు ఆడే ఆటపై మీ దృష్టిని కేంద్రీకరణ చేసి మీ ప్రతిభను ఈ గ్రామ స్థాయిలో మెరుగుపరుచుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని నేను ,నా మిత్రుడు తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి కోరుకుంటూ మీకు ఈ కిట్లు అందజేయడం జరుగుతుంది. కనుక ఈ చక్కని సదవకాశాన్ని వినియోగించుకుని మీరు ఉన్న స్థానాన్ని నుండి ఉన్నత స్థానాన్ని ఎదగాలని కోరుకునే వాళ్లలో తపన చౌదరి ముందుంటారని,వారి ఆశలు ఆశయాలు నెరవేరుస్తారని మీ అందరికీ విన్నవిస్తున్నా మళ్లీ మీరు ఉన్నత స్థానానికి ఎదిగినప్పుడుమిమ్మల్ని అభినందించడానికి ముఖ్య అతిథిగా నేనే వస్తా అని ప్రతి ఆటగాడి భుజం చరచి ఉత్తేజాన్ని ఇచ్చారు, శ్రీరామ్ తో కలసి ఫోటోలు దిగతానికి యువత ఉత్సాహం చూపించారు.. ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా పాల్గొని ప్రముఖ గేయ రచయిత శ్రీరామ్ ని చూడటానికి మండవల్లిలో అభిమానులు యువతీ యువకులు బారులుతీరారు.ఈ కార్యక్రమంలోబిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపాటి సత్యనారాయణ, బిజెపి కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షులు కీర్తి వెంకట్ రామ్ ప్రసాద్, కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా కోశాధికారి లోకం వెంకటేశ్వరరావు, పూర్వపు శివాలయం అధ్యక్షులు బండి రంగారావు, మండవల్లి మెండ సురేష్, సైదు ఆనంద్ బాబు, చింటాపాడు ఎంపీటీసీ జయమంగళ వీర్రాజు, గంగునేని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గుంతల ఆంధ్రప్రదేశ్‌లో దారేది?

**జనసేన,తెలుగుదేశం ఉమ్మడి పోరు**

**తాడేపల్లిగూడెం,మేజర్న్యూస్:** జనసేన పార్టీ - తెలుగు దేశం పార్టీ ఉమ్మడిగా చేపట్టిన కార్యక్రమం ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం - గుంతల రాజ్యం గోతుల రాజ్యం "గుంతల ఆంధ్రప్రదేశ్ కు దారేది" అనే పేరుతో ఉమ్మడి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాస్ తనయులు రాజేష్ మాట్లాడుతూ జగన్ పాలన మొత్తం అవినీతిమయంగా మారిపోయిందటు, నేతలు సైతం దోచుకోవడంలో నిమగ్నమై పోయారంటూ విమర్శించారు. రాష్ట్రంలో రహదారులపై గోతులు చెరువులను తలపిస్తున్నాయనీ రహదారులపై గోతులు కూడా పూడ్చలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందనీ స్థానిక మన జనసేన నాయకులు జన సైనికులు గత నాలుగు సంవత్సరాలుగా గ్రామంలో పట్టణంలో సొంత ఖర్చులతో మరమ్మత్తు పనులు చేశామని ఈ ప్రభుత్వం నికి మళ్ళీ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న ఇంకా మొద్దు నిద్ర వీడలేదని ప్రజల ఇబ్బందులు పట్టించుకోవడం లేదని వచ్చే ఎన్నికల్లో మీ ఓటు హక్కుతో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించి తాడేపల్లిగూడెం అభివృద్ధికి సహకరించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ వలవల బాబ్జి మాట్లాడుతూ నాగున్నరేళ్లుగా నిర్వహణ లేక రాష్ట్ర



వ్యాప్తంగా ధ్వంసమైన రోడ్లు ను చూస్తూ వైసీపీ నాయకులు నిద్రపోయారనీ ప్రజల కష్టాలు గాలికి వదిలేశారని 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం ప్రభుత్వంలో అభివృద్ధి పాలన ఎలా ఉందో ప్రజలు గమనించాలని జనసేన, టిడిపి కలిసి ఉమ్మడిగా వచ్చే ఎన్నికల్లో సైకో జగన్ను గద్దెదింపుతాం అని బాబ్జి అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి సమన్వయకమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.